క్లుప్తంగా

ఈరన్నస్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. మొక్కు చెల్లింపులో భాగంగా పలువురు భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. మరికొందరు క్షేత్ర పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.

ఉరుకుందలో వేలం పాటలు వాయిదా

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కుకు, దేవాలయానికి సంబంధించిన పాత కార్యాలయాన్ని కూల్చివేతకు సోమవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, పాలక మండల చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ దేవదయ శాఖ కర్నూల్ నుంచి ఇన్‌స్పెక్టర్ రాకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. తుదిపరి వేలం తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా చర్చి ప్రారంభోత్సవం



ప్రార్థనలో పాల్గొన్న ఫాదర్ ఆంథోన చైరప్ప, మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండలంలోని పెద్ద భూంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చి ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మేత్రాసన పాలనాధికారి పాదర్ ఆంథోన చౌరప్ప, కోసిగి విచారణ గురువులు ఫాదర్ టోని ఓకాం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చర్చిని ప్రారంభించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి హాజరయ్యారు. నాయకులు గట్టు భీముడు, లక్ష్మీరెడ్డి, అంజి, సంఘం పెద్దలు జేమ్స్, దావీద్, జయరాజు, హనుమంతు, రామయ్య పాల్గొన్నారు.

వైద్యానికి పెద్దపీట వేసిన ఘనత జగనన్నదే

మంత్రాలయం: పేదవాడికి వైద్యం అందేలా చర్యలు చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ముందుగా వైద్య సేవలు పొందుతున్న వృద్ధులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి పోషకాహారాలను రుచి చూశారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు కంటి పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 552 మందికి స్పెషలిస్టు వైద్యులు వైద్యసేవలందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని జొహరాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేంద్ర సోమవారం తెలిపారు. ఈనెల 9వ తేదీన కర్నూలు, నంద్యాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్–14 విభాగంలో మమత, కార్తీక్‌కుమార్, అండర్ –17 విభాగంలో గౌతమి సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నిస్సార్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలూరు: స్థానిక సాయిశ్రీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న హిమవర్ష రెడ్డి రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26న నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సెలక్షన్ పోటీల్లో ఆమె సతాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేపల్లె అర్చన, ఏఓ అరికెర రామిరెడ్డి, పీఈటీ హసన్ తదితరులు తెలిపారు.

టీబీ డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువ ఆంధ్రా సరిహద్దు 250 కి.మీ వద్ద కూడా నీటి ప్రవాహం తక్కువగా నమోదైంది. దాదాపు 600 క్యూసెక్కులకు గాను సోమవారం ఉదయం 428 క్యూసెక్కుల నీటి ప్రవాహం మాత్రమే ఉంది. గత కొద్ది రోజులుగా సాగు నీటికి డిమాండ్ పెరగడం, పైభాగంలో జల చౌర్యం వల్ల పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం ఉండడంలేదని ఏపీ రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో 8,943 క్యూసెక్కులుంది.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

అభిషేక్‌కుమార్, ఆదోని సబ్‌కలెక్టర్



స్పందన కార్యక్రమంలో ప్రజల వినతులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేసి వారంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, సీనియర్ సహాయకులు రామయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతస్‌ప్రియ, ఉప తహసీల్దార్ వలీబాషా పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన భీమన్నకు సర్వే నంబర్ 396/ఏలో 0.66 సెంట్ల భూమి ఉందని, ప్రస్తుతం ఆ భూమిలో పంటలు సాగు చేసుకునేందుకు రానివ్వకుండా కొందరు దౌర్జన్యం చేస్తున్నారని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం మండగిరి గ్రామానికి చెందిన మేరీకి సర్వేనంబర్ 536లో ప్లాస్ నంబర్ 62 పశ్చిమ దిక్కున ప్రభుత్వ రోడ్డు ఉందని, ఆ రోడ్డు స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతుందని, చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు.
- గోనెగండ్ల మండల కేంద్రానికి చెందిన నబి రసూల్‌కు సర్వేనంబర్ 752/3 మరియు 752/బీలో పైకి 3.72 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.
- హొళగుందకు చెందిన చిగిలి చెన్నమ్మకు సర్వే నంబర్ 174/బీలో 2 ఎకరాల భూమి ఉందని, అయితే ఆ భూమి ఆర్‌ఓఆర్ అడంగళ్‌లో వేరే వారి పేరున నమోదైందని, విచారణ చేసి తన పేరును నమోదు చేయాలని విన్నవించారు.

నవంబర్ 10న చెకుముకి పోటీలు



పోస్టర్లను విడుదల చేసిన ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: నవంబర్ 10న చెకుముకి పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని పురపాలక, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అలిమ్ సిద్ధిఖీ సమక్షంలో సైన్స్ సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న చెకుముకి పోటీల పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పోటీల ద్వారా విద్యార్థులలో సైన్సు పట్ల అవగాహన, అభిరుచి పెరుగుతుందన్నారు. శంకరయ్య మాట్లడుతూ 8,9,10 తరగతుల విద్యార్థులు చెకుముకి పరీక్షలు రాయడానికి అర్హులన్నారు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్‌లో ఉంటుందని, పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షకు నామ మాత్రపు రుసుం రూ. 10 ఉంటుందని వివరించారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు మండల స్థాయిలో నవంబర్ 30 పరీక్ష రాయాల్సి ఉంటుందని, అక్కడ విజేతలుగా నిలిచిన వారు జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయిలో జరిగే పరీక్షల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు గాదిలింగప్ప, శ్రీనివాసులు, రామాంజినేయులు, నరసయ్యగౌడ్, రంగన్న, దావీదు, రాఘవేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

కాలువలకు సాగునీరు విడుదల



కాల్వలకు నీరు విడుదల చేస్తున్న ఎల్లెల్సీ అధికారులు, పోలీసులు

కౌతాళం : వారాబందీ వల్ల రైతుల బాధపడాల్సిన అవసరం లేదని ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్, డీఈ షఫిఉల్లా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని డిస్ట్రీబ్యూటరీ నుంచి ప్రధాన కాల్వలకు సాగునీటిని విడుదల చేశారు. వారాబందీ వల్ల ఆదివారం ఉదయం నుంచి నీటిని నిలిపివేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఒకటిన్నర రోజు మాత్రమే వారాబందీ ఉంటుందని రైతులకు హామీ ఇవ్వడంతో సోమవారం సాయంత్రం కోసిగి సీఐ ఎరిసావలి, ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డితో కలిసి నీటిని విడుదల చేశారు. ఈఈ శైలేశ్వర్ మాట్లాడుతూ పంటలు ఎండిపోకుండగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, నవంబర్ చివరి వరకు సాగైన పంటలకు నీరు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. కాల్వ ఎగువన ఉన్న పంటలతో పాటు దిగువన సాగైన పంటలను కూడా కాపాడాలని వారాబందీ విధించామని చెప్పారు.

చౌకబారు రాజకీయాలు మానుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: టీడీపీ మండల నాయకుడు ముత్తురెడ్డి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, హొలగుంద కోసిగయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి చెందిన కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మీరు కండువాలు వేసి పార్టీలోకి చేరిన వారిలో ఏ ఒక్కరు వైఎస్సార్ సీపీ జెండా మోయలేదని, ఏనాడు పార్టీలో తిరిగిన దాఖలాలు లేవన్నారు. యువగళంలో భాగంగా నారా లోకేష్ కోసిగి వచ్చిన సమయంలో టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో అందులో కొందరు ముద్దాయిలుగా ఉన్నవారేనని గుర్తు చేశారు. ఇందులో కొందరు వారి పని కోసం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కలిశారే తప్ప తమ పార్టీ వారు కాదన్నారు. తమ అధినాయకులు పార్టీల కతీతంగా అందరికీ సహకరించారని గుర్తు చేశారు. నాయకులు వందగల్లు లక్ష్మయ్య, కాంట్రాక్టర్ నాగరాజు, ముకుంద కృష్ణ మూర్తి, కార్యకర్తలు ఉన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల వృద్ధి



గుంత తవ్వకాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

ఆలూరు: ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని ఏపీడీ పక్కీరప్ప రైతులకు సూచించారు. ఆలూరు సమీపంలో ఉపాధి కూలీలు చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓ, టీసీ, ఈసీ, కోపా, ఎఫ్‌ఏలు, టీసీ తదితరులతో సమావేశం నిర్వహించారు. జల వనరులను సంరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫారం పాండ్స్, డక్ అవుట్స్, మొక్కల పెంపకం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే తక్కువ నీటితో లాభసాటి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. అలాగే వలసలను అరికట్టేలా ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు.

రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుంటే చర్యలు



వ్యాపారస్తులకు సూచనలు చేస్తున్న అధికారులు

గోనెగండ్ల: ఎమ్మిగనూరు – కర్నూలు రోడ్డు స్థలంలో బంకులు ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ తిమ్మారెడ్డి వ్యాపారస్తులను హెచ్చరించారు. సోమవారం వారు ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రధాన రహదారిపై పర్యటించి వ్యాపారస్తులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిలో రోడ్డుకిరువైపులా అక్రమంగా బంకులు, షెడ్లు, పానిపూరీ, ఫాస్ట్‌ఫుడ్, బజ్జీల బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో ఆ దారిలో వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీంతో రోడ్డులో ఏర్పాటు చేసుకున్న బంకులను తొలగించడం జరుగుతోందన్నారు. అలాగే హోటల్ నిర్వాహకులు రోడ్డుపై నీళ్లు చల్లడం, చెత్త వేయడం చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యాలయం ఇన్‌చార్జ్ సతీష్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

15 గొర్రెల అపహరణ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని సూదాపల్లె గ్రామానికి చెందిన తప్పెట జయరాముడుకు చెందిన 15 గొర్రెలు అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 10న రాత్రి గ్రామంలోని బోయ బాలరాముడు పొలంలో గొర్రెల మంద నిలిపిఉంచారు. ఉదయాన్నే మందను సరిచూసుకోగా 15 గొర్రెలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెలను అపహరించినట్లు నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీటి విలువ దాదాపుగా లక్షన్నర ఉంటుందని ఆయన తెలియజేశారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

వెల్దుర్తిలోని బైరిపోగు చిన్న మద్దిలేటి అనే వ్యక్తి ఇంటి వద్ద సోమవారం 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆదోని సెంట్రల్: పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం మూడవ పట్టణ సీఐ నరసింహరాజు, ఎస్‌ఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలను ఇంగ్లిష్, తెలుగు మీడియంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జోనాథన్ పర్యవేక్షణలో సాగాయి. ఇంగ్లిష్ మీడియం పోటీల్లో ఆర్. ఇందు, సంజన షారోన్ శ్వేత, తెలుగు మీడియంలో పవన్‌కుమార్, జెర్మియా, ఈశ్వరమ్మ ప్రతిభ చాటారు. ఇంటర్ విద్యార్థుల్లో సిద్దార్థుడు, తిరుమల, జగన్‌నాథ ప్రతిభ చూపారు.

కర్ణాటక మద్యం విక్రయదారుల అరెస్ట్

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని ఇస్వీ రోడ్డులోని బాలకొలను గుడి సమీపంలో కర్ణాటక మద్యం నిల్వ ఉంచిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 18బాక్సుల ఆఫీసర్స్ చాయిస్ కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తెలంగాణలో విక్రయించడానికి గుడి సమీపంలో డంప్ చేశారన్నారు. తమను చూసిన నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా బోయగేరికి చెందిన బోయ కార్తీక్, వాల్మీకినగర్‌కి చెందిన రామంజి, బావాజీపేటకు చెందిన వెంకటేష్, బోయగుంటిలను అదుపులోకి తీసుకొని విచారించి వారి వద్ద గల 90 ఎం.ఎల్. పరిమాణం గల 18 బాక్సులు (1,728 టెట్రాప్యాకెట్లు) కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని, నలుగురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. అలాగే వారు ఉపయోగించిన ఏపీ21ఎం 6235 నంబర్ మోటార్ సైకిల్‌ను సీజ్ చేశామని చెప్పారు.

ఆదోనిరూరల్ : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని మండలంలోని సంతెకూడ్లూరు క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆదోని పట్టణం బోయగేరికి చెందిన బోయ రవి నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 222 టెట్రా ప్యాకెట్లు, హానవాల్ గ్రామానికి చెందిన ఉశేని నుంచి 576 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

మంత్రాలయం: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన ఆనందరాజు (55) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూల్‌కు రెఫర్ చేశారు. సోమవారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అప్పుల బాధలే ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఆదోనిఅర్బన్: మండలంలోని జి.హొసళ్లి గ్రామానికి చెందిన చెన్నయ్య కుమారుడు అరవింద్ (4) అనే బాలుడు సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు. దీంతో బంధువులు కేసు వద్దని, బాలుడి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే బాలుడు ఇంట్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగను పట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్తులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు నేడు ఆఖరు

ఆదోని సెంట్రల్: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ చదివేందుకు సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే అడ్మిషన్లకు మంగళవారం చివరి రోజని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ వి. సంజన్న సోమవారం తెలిపారు. 10వ తరగతిలో ప్రవేశానికి 14 సంవత్సరాలు,ఇంటర్‌లో అడ్మిషన్‌కు 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. టీసీ, 10వ తరగతి సర్టిఫికెట్‌తో పాటు అధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాగ్దానాలను నెరవేర్చిన ఘనత జగనన్నదే



మరాఠీ గేరిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి నూతన రాజకీయాలకు తెర తేశారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం హామీ, తాను ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ పరిష్కరిస్తున్నామని చెప్పారు. పట్టణంలోని 31వ వార్డు మరాఠీగేరిలో 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపను సందర్శించారు. ఇళ్లలోని మహిళలు, అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రోడ్లు, కాలువలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అంచనాలు రూపొందించాలని అక్కడే ఉన్న వార్డు సచివాలయ ఇంజినీరింగ్ సెక్రటరీ, మున్సిపల్ ఏఈని ఆదేశించారు. నెల రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకుందామని, మరెన్నో పథకాలతో లబ్ధి పొందుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు పోలకల్ రేణుక, మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యుడు దేవా, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిమ్మప్ప, శీను, జైపాల్, సూరి, నాగరాజు, రామంజి, శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చిన్నఈరన్న, వీరప్ప, సునాగ్, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

జోరుగా అదనపు గదుల నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న అదనపను తరగతి గదులు

ఆదోని సెంట్రల్: పట్టణంలో విజయభాస్కరెడ్డి కాలనీలోనున్న ఎస్.రామయ్య పురపాలక ఉన్నత పాఠశాలలో గదుల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. కాలనీ వాసులు కోరిక మేరకు పట్టణంలో నడుపుతున్న పాఠశాలను కాలనీలో 2019లో ఏర్పాటు చేశారు. ఒక ఇంటిని అద్దెకు తీసుకొని పాఠశాలను ప్రారంభించారు. 37 మందితో ప్రారంభమైన ఈ పాఠశాలలో నేడు 1– 5వ తరగతి వరకు 107 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో మరో రేకుల షెడ్డును కూడా బాడుగకు తీసుకున్నారు. ప్రభుత్వం నాడు –నేడు కింద ఎస్. రామయ్య పాఠశాలకు తరగదితో పాటు వంటగది, టాయిలెట్ నిర్మాణాలను చేపట్టిందుకు రూ.42 లక్షల నిధులు మంజూరు చేసింది. గదుల నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించిన వారవుతామని ప్రధానోపాధ్యాయుడు జగన్ మోహన్‌రావు తెలిపారు.లేబర్ సమస్య కారణంగా పనుల్లో జాప్యం నెలకొందని చెప్పారు.

చోరీ కేసు నిందితుల అరెస్ట్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు నగలు

కోసిగి: మండల కేంద్రంలోని ఇళ్లల్లో జరుగుతున్న దొంగతనాల కేసులను చేధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం ఆభరణాలను ప్రదర్శించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సియతలాబ్ ప్రాంతానికి చెందిన సురేష్, పరుశురామ్ అనే ఇద్దరు తాగుడు, జల్సాల కోసం రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. చోరీ కేసులో నిందితుల కోసం గాలిస్తుండగా మంత్రాలయం మండలం మాధవరం సర్కిల్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి మూడు నెలల క్రితం గ్రామీణ బ్యాంక్ సమీపంలో సుజాత ఇంట్లో జరిగిన దొంగతనంలో 10 గ్రాముల ఒక జత బంగారు కమ్మలు, జిమికీలు, వంద గ్రాములు కాళ్ల వెండీ పట్టీలు స్వాదీనం చేసుకున్నారు. అలాగే ఈ నెలలో గీతా మందిరం సమీపంలో జరిగిన ఓ ఇంట్లో రూ.10 వేల నగదును రికవరీ చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామన్నారు. ఏఎస్‌ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, శ్రీనివాసులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడదాం



సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్ : ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సుజాతా ప్రారంభం సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి అధ్యక్షతన పాత బస్టాండు సెంటర్‌లో ప్రజా బహిరంగ సభ నిర్వహించారు. సీపీఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్‌దావలే, కేంద్రకమిటీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే గఫూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రమాదేవి, అనిల్‌కుమార్, భాస్కర్ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న పరిస్థితులు అందరినీ కలవపరుస్తున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిన ప్రజలను మోసం చేసిందన్నారు. జిల్లాల సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో బస్సు జాత చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా రాయలసీమ జిల్లాలో కరువు సమస్యపై ప్రచార జాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 15న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ, వెంటకేశులు, రామాంజనేయులు, ఆనంద్‌బాబు, అంజిబాబు, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి, నాయకులు గోపాల్, ముక్కన్న పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

కబడ్డీ విజేత చిట్యాల జట్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన ఓపెన్ కబడ్డీ పోటీల్లో చిట్యాల జట్టు విజేతగా నిలిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 42 జట్లు పాల్గొనగా సోమవారం జరిగిన ఫైనల్‌లో చిట్యాల జట్టు విజేతగా నిలిచింది. తరువాతి స్థానాల్లో వరుసగా గూడూరు మండలం అయ్యకొండ జట్టు, కోడుమూరు మండలం కే.చనుగొండ్ల జట్టు, ఆత్మకూరు మండలం సాంబపురం జట్టు గెలుపొందాయి. విజేతలకు దాతలు గంగిరాయుడు, రాముడు, అంజినేయులు, గురుస్వామి, గోపాల్, మహేష్, కిట్టు, శివ సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దుకాణంలో అగ్నిప్రమాదం

దేవనకొండ: మండల కేంద్రంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. నేలతలమరి గ్రామానికి చెందిన రామచంద్ర దేవనకొండలో రాము మొబైల్స్ పేరిట షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు ఏర్పడ్డాయి. దుకాణంలోని మొత్తం సామగ్రి కాలి బూడిదైంది. దాదాపు రూ.6 లక్షలు విలువ గల మొబైల్స్, విడిభాగాలు, రిపేరీ పరికరాలు కాలి బూడిదయ్యాయని బాధితుడు రామచంద్ర వాపోయాడు.

పన్ను చెల్లించకపోతే నోటీసులు

ఆలూరు: పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 150 గ్రామ పంచాయతీలలో పన్ను బకాయిలు చెల్లించకపోతే నోటీసులు జారీ చేస్తామని డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటిపన్ను, డంపింగ్ యార్డు, గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర వాటిపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఆయా పంచాయతీలలో పన్ను వసూళ్లపై బిల్ కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.